క్లుప్తంగా

సొసైటీ సభ్యుల వివరాలు ఆన్‌లైన్ చేయించుకోండి

కొవ్వూరు: స్థానిక శ్రీరామ సొసైటీ సభ్యులు తమ వివరాలను ఆన్‌లైన్ చేయించుకోవాలని సొసైటీ కార్యదర్శి బి.రాధాకృష్ణ సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం ప్రతి సభ్యుడూ తన ఆధార్ కార్డు వివరాలను కంప్యూటరైజ్ చేయించుకోవాలన్నారు. రెండు నెలలుగా సంఘ సభ్యుల రికార్డులను కంప్యూటరైజ్ చేస్తున్నామన్నారు. సంఘంలో సభ్యత్వం తీసుకుని ఇంత వరకూ ఎలాంటి లావాదేవీలు జరపనట్టయితే కచ్చితంగా తమ ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌ను సమర్పించి ఆన్‌లైన్ చేయించుకోవాలని సూచించారు.

అన్నదేవరపేట సొసైటీ..

తాళ్లపూడి: అన్నదేవరపేట సొసైటీ సభ్యులందరూ తమ రికార్డులను కంప్యూటరైజ్ చేయించుకోవాలని ఆ సొసైటీ సీఈవో పి. శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సొసైటీలో అన్నదేవరపేట, వేగేశ్వరపురం, గజ్జరం, తిరుగుడుమెట్ట, తాళ్లపూడి, ప్రక్కిలంక, పైడిమెట్ట గ్రామాల రైతులు సభ్యులుగా ఉన్నారన్నారు. వారిలో సొసైటీ సభ్యత్వం తీసుకుని ఇప్పటి వరకూ ఎలాంటి లావాదేవీలు జరపని సభ్యులు ఇకపై కూడా సభ్యులుగా కొనసాగాలంటే ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్, ఫొటోతో సొసైటీ వద్ద సంప్రదించాలన్నారు.

వృద్ధాశ్రమంలో దుప్పట్ల పంపిణీ

దేవరపల్లి: మండలంలోని గొల్లగూడెం వద్ద గల లగడపాటి రామలక్ష్మమ్మ, రామానాయుడు దివ్యాంగుల, వృద్ధాశ్రమంలో సోమవారం గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ డి.సువర్ణరాజు దుప్పట్లు పంపిణీ చేశారు. సువర్ణరాజు జన్మదిన వేడుకలను సోమవారం ఆశ్రమంలో నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ఆంధ్రు అనిల్, జనసేన మండలశాఖ అధ్యక్షుడు కాట్నం గణేష్, జనసేన, టీడీపీ నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

సేవలే కలకాలం గుర్తుంటాయి



దయారాజగిరిని సన్మానిస్తున్న టీచర్లు, విద్యార్థులు

నిడదవోలు: సర్వీసులో ఉండగా చేసిన సేవలే ఉద్యోగులకు కలకాలం గుర్తుండిపోతాయని ఎంఈఓ గురుమూర్తి అన్నారు. పట్టణంలోని ఎల్ఎల్ఆర్ మున్సిపల్ హైస్కూల్లో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న మెంటే దయారాజగిరి ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో ఆదివారం రాత్రి, ఎల్ఎల్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం దయారాజగిరిని వేర్వేరుగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ జి.మమ్మి మాట్లాడుతూ దయారాజగిరి 40 ఏళ్ల పాటు ఉపాధ్యాయురాలిగా సేవలందించి మంచి గుర్తింపు పొందారన్నారు. అనంతరం దయారాజగిరిని ఉపాధ్యాయులు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రత్తి సువర్ణరాజు, కార్యదర్శి కె.శ్రీనివాస్, ఏపీటీఎఫ్ పట్టణశాఖ అధ్యక్షుడు ఏవీ అప్పారావు, హెచ్ఎంలు కె.కృష్ణకుమారి, ఎన్. భీమారావు, ఏపీటీఎఫ్ పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, పాస్టర్ రెవరెండ్ కమలాకర్, కె. సుజ్ఞానరాజు, డి.విజయ్‌కుమార్, మేడేపల్లి ప్రవీణ్‌కుమార్, జయాప్రియదర్శిని, కాళదాశి మాధవి, సుహాస్‌రాజ్ ఐజాక్ పాల్గొన్నారు.

అధ్యాపకుడికి వీడ్కోలు సన్మానం



కోట రామప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఉండ్రాజవరం: గత నెలాఖరున ఉద్యోగ విరమణ చేసిన ఉండ్రాజవరం హైస్కూల్ ప్లస్ గరల్స్ జూనియర్ కళాశాల అధ్యాపకుడు కోట రామప్రసాద్‌ను అదే హైస్కూల్లో సోమవారం రాత్రి ఘనంగా సన్మానించారు. రామప్రసాద్ దంపతులను ఎంఈవోలు సక్సేనా రాజు, శారదా జ్యోత్స్నలతో పాటు ఆ పాఠశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.మాణిక్యాలరావు, యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు ఐ.రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంకేతిక సమస్యలతో పింఛన్ల పంపిణీలో ఇక్కట్లు

చాగల్లు: సోమవారం పెన్షన్ల పంపిణీలో ఇబ్బందులు తలెత్తాయి. ఉదయం 8 గంటల నుంచి సర్వర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దాంతో పింఛన్ల పంపిణీ నిలిచిపోయింది.దీంతో వృద్ధులు, వికలాంగులు ఇళ్ల వద్ద అధికారులు పడిగాపులు పడాల్సి వచ్చింది. ఆ తరువాత చాలాసేపటికి సమస్య పరిష్కారం కావడంతో పంపిణీ ప్రారంభించారు.

ఆగస్టు 31 వరకూ డయేరియాపై ప్రచారం

రెండు నెలల పాటు వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రచారం



పోతవరంలో డయేరియా వ్యాధి లక్షణాలు వివరించే పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యుడు, సిబ్బంది

కొవ్వూరు: వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున జులై 1 నుంచి ఆగస్టు 31 వరకూ రెండు నెలల పాటు డయేరియాపై ప్రభుత్వం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం దొమ్మేరు పీహెచ్‌సీ పరిధిలో చేపట్టిన డయేరియా ప్రచారాన్ని సోమవారం ఎమ్మెల్యే ఆ గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా డయేరియా వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించే పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ప్రతి పీహెచ్‌సీ, హెల్త్ క్లినిక్ పరిధిలో ఓఆర్ఎస్, జింక్ టాబ్లెట్లు అందుబాటులో ఉంచామని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ధర్మరాజు తెలిపారు. ఈ రెండు నెలలూ వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి డయేరియా లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు), జెడ్పీటీసీ సభ్యురాలు బొంత వెంకటలక్ష్మి, సర్పంచ్ తానేటి కుమారి, ఉప సర్పంచ్ కలగర సుబ్బారావు, ఎంపీడీవో కె.సుశీల, ఎంపీటీసీ సభ్యురాలు ఆశపు సరోజిని పాల్గొన్నారు.

పోతవరంలో అవగాహన ర్యాలీ

నల్లజర్ల: స్టాప్ డయేరియా ప్రచారాన్ని జులై 1 నుంచి ఆగస్టు 31 వరకూ నిర్వహిస్తున్నట్టు పోతవరం పీహెచ్‌సీ డాక్టర్ ఎల్.రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమం ప్రారంభం సందర్భంగా సోమవారం పోతవరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉధృత అతిసార నియంత్రణ మాసోత్సవాల సందర్భంగా ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఈ రెండు నెలలూ ప్రతి ఇంటినీ సందర్శించేలా కార్యక్రమాలు రూపొందించామన్నారు. అపుడే పుట్టిన పసికందు నుంచి ఐదేళ్ల పిల్లలు ఉన్న ఇళ్లకు ఓఆర్ఎస్, జింక్ మాత్రలు అందించాలని సూచించారు. విరేచనాలు మొదలు కాగానే ఓఆర్ఎస్ ద్రావణం తాగించి రెండు నుంచి ఆరు నెలల శిశువు వరకూ జింక్ మాత్ర అరబిళ్ల ఇవ్వాలన్నారు. ఆరు నెలల నుంచి ఐదేళ్ల పిల్లలకు ఒక జింక్ మాత్ర ఇవ్వాలన్నారు. పీహెచ్‌సీ, సబ్ సెంటర్లు, సచివాలయాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ కార్నర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ర్యాలీలో డాక్టర్ వెంకట్రావు, ఉప సర్పంచ్ యేలేటి సత్యనారాయణ (జేడీ), పసుమర్తి సతీష్, సూపర్‌వైజర్లు సత్యం, ఇందిర, మీరాబాయి, ప్రకాష్, స్టాఫ్ నర్స్ అమరావతి పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం డయేరియా వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించే పోస్టర్‌ను డాక్టర్ రాజశేఖర్, సిబ్బంది ఆవిష్కరించారు.

ఉండ్రాజవరంలో..

ఉండ్రాజవరం: వర్షాకాలంలో వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఉషాదేవి అన్నారు. స్టాప్ డయేరియాపై ఉండ్రాజవరం పీహెచ్‌సీలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకుడు గన్నమని వెంకట సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా స్టాప్ డయేరియాపై అవగాహన కల్పించే పోస్టర్లు విడుదల చేశారు. అలాగే అరుధంతీయ పేటలో స్టాప్ డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

నల్లజర్ల: స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని సంపూర్ణంగా విజయవంతం చేయాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు.సోమవారం నల్లజర్ల పీహెచ్‌సీ వద్ద స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు గంగాధరరావు, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గౌరీపట్నంలో..

దేవరపల్లి: అతిసార వ్యాధిపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్టు గౌరీపట్నం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సతీష్ తెలిపారు. పీహెచ్‌సీలో సోమవారం అతిసార వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించి వాల్‌పోస్టల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ మాట్లాడుతూ స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ సచివాలయం నందు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పిల్లలు ఉన్న ప్రతి ఇంటికి రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ చిన్నికృష్ణుడు, హెల్త్ సూపర్‌వైజర్ వి. అశోక్ వర్ధన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గౌరీపట్నం పీహెచ్‌సీలో అతిసార వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సతీష్, సిబ్బంది

'పైడిమెట్ట' నూతన పాలకవర్గం ప్రమాణం

తాళ్లపూడి: పైడిమెట్ట ఎత్తిపోతల పథకం నిర్వహణ సక్రమంగా సాగేందుకు రైతులు వెంటనే బకాయిలు చెల్లించి సహకరించాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని పైడిమెట్ట ఎత్తిపోతల పథకం వద్ద సోమవారం ఆ ఎత్తిపోతల పథకం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. కమిటీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన ముళ్లపూడి శ్రీరామచంద్ర మూర్తిని ఎమ్మెల్యే పూలమాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ పథకానికి చెందిన నాలుగు మోటార్లలో కేవలం రెండు మాత్రమే పని చేస్తున్నాయన్నారు. రూ.కోటికి పైగా ఉన్న బకాయిలను రైతులు చెల్లించి ఈ సీజన్‌లో ఎత్తిపోతల పథకం నడిచేలా సహకరించాలని కోరారు. ఇరిగేషన్ డీఈ గురవయ్య మాట్లాడుతూ ఈ ఎత్తిపోతల పథకం కింద 4,900 ఆయకట్టు ఉండగా, 3,600 ఎకరాలకు నీరు అందుతున్నట్టు తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్లో పథకం నడవాలంటే రూ.20 లక్షలు అవసరం ఉందన్నారు. ఏడాదికి రూ.33 కోట్లు కరెంట్ బిల్లు వస్తుండగా, ఆ మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. ఈ సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు, పారిశ్రామిక వేత్త అల్లూరి విక్రమాదిత్య తదితరులు పాల్గొన్నారు.

మీకోసంలో ఆరు అర్జీలు



'మీకోసం'లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



పెరవలి తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న రైతులు

కొవ్వూరు: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కొవ్వూరు డివిజన్ స్థాయిలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమానికి ప్రజల నుంచి ఆరు అర్జీలు అందాయి. వాటిని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ స్వీకరించారు. తన ఖాతాకు పీఎం కిసాన్ సొమ్ము జమ కాలేదని తోగుమ్మి గ్రామానికి చెందిన కాకులపాటి వీర వెంకట శేషారావు అనే రైతు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి, ఆ మొత్తం జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే తన స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించడమే గాకుండా, అదేమని ప్రశ్నించిన తనను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కొవ్వూరు మండలం చిడిపి గ్రామానికి చెందిన పత్తిపాటి నాగరాజు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఆ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరాడు. తనకు చెందిన 0.7 సెంట్ల భూమిని బండి దారిగా అడంగల్‌లో నమోదు చేయించాలని దొమ్మేరుకి చెందిన దుగ్గిరాల శ్రీను అనే రైతు కోరారు. తన పిల్లల నిమిత్తం టీసీ, స్టడీ సర్టిఫికెట్స్ ఇప్పించాలని తాడేపల్లిగూడెం మండలం జగన్నపేటకు చెందిన ఓ మహిళ వినతి పత్రం అందజేశారు. మురుగు నీరు వెళ్లే బోదెను ఆక్రమణల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని పశివేదలకు చెందిన వి.సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి కోరారు.

రబీ ధాన్యం సొమ్ములు అందలేదు

పెరవలి: రబీ ధాన్యం అమ్మి రెండు నెలలు అవుతున్నా ఇప్పటికీ సొమ్ములు చెల్లించలేదని పలువురు రైతులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఇలా అయితే తాము ఖరీఫ్ పంటకు పెట్టుబడి ఎక్కడి నుంచి సమకూర్చుకోవాలని పెరవలి, ఖండవల్లి గ్రామాల ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి చిట్టూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం రెండు నెలల క్రితం ధాన్యం కొనుగోలు చేసిందని, ఇంత వరకూ రైతులకు సొమ్ములు చెల్లించలేదన్నారు. మండలంలోని 1,500 మంది రైతులకు రూ.24 కోట్ల మేర రబీ ధాన్య బకాయిలు అందవలసి ఉందన్నారు. దీనిపై తహసీల్దార్ డి.సుధ మాట్లాడుతూ రైతుల ఫిర్యాదును జిల్లా ఉన్నతాధికారులకు పంపి, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రెడ్డి రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచి పంపిణీ చేస్తున్నాం

- రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్
- డివిజన్ వ్యాప్తంగా పెన్షన్ల పంపిణీ



నిడదవోలు మండలం గోపవరంలో దివ్యాంగురాలికి పింఛను అందజేస్తున్న మంత్రి కందుల దుర్గేష్



దేవరపల్లిలో లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



కొవ్వూరు యానాది కాలనీలో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

నిడదవోలు రూరల్: ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం పెన్షన్ల నగదును పెంచి పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని గోపవరంలో సోమవారం మంత్రి దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పెన్షన్‌దారుల ఇంటికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. స్థానిక బీసీ సామాజిక భవనంలో సర్పంచ్ ఆరేపల్లి భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి దుర్గేష్ మాట్లాడారు. నియోజకవర్గంలోని 35,817 మంది పింఛనుదారులకు రూ.24.18 కోట్ల నగదు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి దుర్గేష్, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి సుజాత, ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు. అలాగే నిడదవోలు పట్టణంలోని చర్ల సుశీల వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను మంత్రి కందుల దుర్గేష్ అందించారు. ఇక పెరవలి మండలం తీపర్రు గ్రామంలోను లబ్ధిదారులకు మంత్రి పింఛన్లు అందజేశారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

దేవరపల్లి: ప్రజలకు సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తామని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని యర్నగూడెం, త్యాజంపూడి, పల్లంట్ల, కురుకూరు, దేవరపల్లి, గౌరీపట్నం గ్రామాల్లో సోమవారం లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొవ్వూరు: నియోజకవర్గంలో సోమవారం ఇంటింటికీ ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. యనాద, రాజీవ్, అచ్చాయమ్మ కాలనీలతో పాటు దొమ్మేరు, కాపవరం గ్రామాల్లో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కొవ్వూరు మండలంలో 10,257 మందికి పింఛను పంపిణీ చేయాల్సి ఉండగా సోమవారం సాయంత్రానికి 91 శాతం పూర్తి చేసినట్టు ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో 4,015 మంది లబ్ధిదారులకు గాను 94 శాతం మందికి పంపిణీ చేసినట్టు కమిషనర్ దానియేలు జోసెఫ్ ప్రకటించారు. అర్బన్‌లో 83, రూరల్‌లో 160 మంది సచివాలయాల సిబ్బందిని,10 మంది ఇతర శాఖల సిబ్బంది ద్వారా పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, మునిసిపల్ కమిషనర్ దానియేలు జోసెఫ్, ఎంపీడీవో సుశీల పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

నల్లజర్ల మండలంలో 80 శాతం

నల్లజర్ల: మండలంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు 80 శాతం పెన్షన్‌లు పంపిణీ పూర్తయినట్టు ఎంపీడీఓ నరేష్‌కుమార్ తెలిపారు. పంపిణీ కార్యక్రమం ఉదయం వేగంగా జరిగినా మధ్యాహ్నం సర్వర్ నెమ్మదించడంతో పంపిణీ మందకొడిగా జరిగింది. గంటావారిగూడెంలో మండల ప్రత్యేకాధికారి డి.కృష్ణారావు, ఎంపీడీఓ నరేష్‌కుమార్, ఈఓపీఆర్డీ సింహాద్రి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అజయ్‌బాబు పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గంటావారిగూడెం, అనంతపల్లి, నల్లజర్ల గ్రామాల్లో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండల ప్రత్యేకాధికారి (డీపీవో)రాంబాబు మలకపల్లి గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలో మొత్తం 7,941 పింఛనుదారులు ఉండగా, తొలిరోజు 7340 మందికి పింఛన్లు (92 శాతం) పంపిణీ చేశామని ఎంపీడీవో వెంకటరమణ తెలిపారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ కిట్ల పంపిణీ



పాలంగిలో విద్యార్థులకు స్కూల్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి ఎంపీపీ నంబర్-2 పాఠశాల విద్యార్థులకు సోమవారం ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం కె.పావని ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కూల్ బ్యాగ్, బెల్ట్, షూస్, సాక్స్‌లతో కూడిన కిట్లను విద్యార్థినీ విద్యార్థులకు ఎంపీపీ అందజేశారన్నారు. విద్యార్థులకు యూనిఫాం రావాల్సి ఉందన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ బొక్కా శ్రీనివాసు, పాలాటి శరత్‌బాబు పాల్గొన్నారు. అలాగే మోర్త ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల నంబర్-2లో సర్పంచ్ చిటికెన సుజని, ఎంపీటీసీ సభ్యురాళ్లు జానీ నాగలక్ష్మి, వెలగట్ల రాణి, ఉప సర్పంచ్ సందీప్, గ్రామపెద్దలు రాచమళ్ల శ్రీనివాసరావు, కంటిపూడి నరేంద్ర, పోలిశెట్టి దుర్గాభవాని చేతుల మీదుగా విద్యార్థులకు స్కూల్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎంఎస్ఎల్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

నేను బడికి పోతాం ర్యాలీ



వేగేశ్వరపురంలో నేను బడికి పోతాం ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తాళ్లపూడి: అన్ని వసతులూ ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఎంఈవో సీహెచ్ బాలామణి సూచించారు. మండలంలోని వేగేశ్వరపురం కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నేను బడికి పోతాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో బడి బయట పిల్లలు లేకుండా చర్యలు తీసుకుంటామని ఎంఈవో బాలామణి తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-2 సీహెచ్ నెహ్రూజీ, ఉపాధ్యాయులు సుభాషిణి, లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు రోటరీ క్లబ్‌కు అవార్డుల పంట



అవార్డులు అందుకున్న రోటరీ సభ్యులు

నిడదవోలు: ఉత్తమ సామాజిక సేవలకు గాను రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖకు అవార్డుల పంట పండింది. విజయవాడలో ఆదివారం రాత్రి నిర్వహించిన రోటరీ అవార్డ్స్ నైట్ రోటరీ డిస్ట్రిక్ట్ - 3020 కార్యక్రమంలో పలు అవార్డులు అందజేశారు. భూపతి ఆదినారాయణకు ఎండ్ పోలియో అవార్డ్, మేజర్ డోనర్ అవార్డు, రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులుకు ఉత్తమ అధ్యక్షుడి అవార్డు, రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3020లో ఉత్తమ సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు గాను బెస్ట్ ప్రెసిడెంట్ ప్లాటినం అవార్డుతో అరుదైన గౌరవం లభించింది. పోలదాసు శ్రీనివాసరావు ఉత్తమ అసిస్టెంట్ గవర్నర్ గోల్డ్ అవార్డ్, కారింకి సాయిబాబుకు ఉత్తమ ఫ్యామిలీ మీట్ డైమండ్ అవార్డు, గోపిరెడ్డి శ్రీనివాస్, గుంటిపల్లి శివ కుమార్‌లకు ఉత్తమ కార్యదర్శి సిల్వర్ అవార్డులతో పాటు వివిధ విభాగాల్లో 27 అవార్డులు లభించాయి. రోటరీ గవర్నర్ రావూరి వెంకట సుబ్బారావు ఈ అవార్డులను ప్రదానం చేశారు.

అదుపులో డయేరియా కేసులు

డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

సాక్షి ఇంపాక్ట్



గుడ్డిగూడెం నిర్వహిస్తున్న వైద్య శిబిరం

దేవరపల్లి: గోపాలపురం మండలం హుకుంపేటలో డయేరియా కేసులు కొత్తగా నమోదు కాలేదని, ప్రస్తుతం వ్యాధి అదుపులో ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డయేరియాతో ఏడుగురికి అస్వస్థత అనే శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. హుకుంపేట, అన్నదేవరపేట పీహెచ్‌సీలు గోపాలపురం మండలంలో ఉన్నాయని ఆయన తెలిపారు. హుకుంపేట నుంచి కేవలం ఆరు డయేరియా కేసులు నమోదైనట్టు చెప్పారు. గోపాలపురంలో ఎటువంటి కేసులూ నమోదు కాలేదన్నారు. గుడ్డిగూడెంలో పీహెచ్‌సీ వైద్య శిబిరంలో డయేరియా సోకిన వారు చికిత్స పొందుతున్నారని తెలిపారు. కోమటికుంటలో ఎక్కడా డయేరియా కేసు నమోదు కాలేదన్నారు. ఇప్పటి వరకూ గోపాలపురం మండలంలో ఎక్కడా కొత్తగా కేసులు నమోదు కాలేదని వివరించారు. కొన్ని పత్రికల్లో వచ్చిన సమాచారం వాస్తవం కాదన్నారు. గుడ్డిగూడెంలోని ఓ ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికుడు హజీధర్ రాజు డయేరియాతో గత నెల 26న గోపాలపురం పీహెచ్‌సీలో చేరినట్టు డీఎంహెచ్‌వో చెప్పారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే గుడ్డిగూడెంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారులను ఆదేశించినట్టు చెప్పారు. అప్పటి నుంచి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు సేవలు అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. గ్రామంలో తాగునీటి వనరులను రోజూ క్లోరినేషన్ చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. రోగులంతా క్షేమంగానే ఉన్నారని, ఎవరిని గోపాలపురం పీహెచ్‌సీకి తరలించలేదని ఆయన స్పష్టం చేశారు. గ్రామంలో ఇంటింట సర్వే జరుగుతోందని జిల్లా సర్వే అధికారి డాక్టర్ రాజీవ్ పేర్కొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన అవసరం



వెంకటాయపాలెంలో కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దేవరపల్లి సీఐ బాలసురేష్

గోపాలపురం: కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దేవరపల్లి సీఐ కె. బాల సురేష్ అన్నారు. గోపాలపురం మండలం వెంకటాయపాలెంలో సోమవారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అధ్యక్షతన కొత్త చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ బాల సురేష్ మాట్లాడుతూ భారతీయ న్యాయ సంహిత, భారతీయ నగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గతంలో కంటె సెక్షన్లు తక్కువ, శిక్షలు ఎక్కువగా ఉన్నాయని నేరం రుజువైతే రిమాండ్ తప్పదని వివరించారు. కక్షలు కార్పణ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. గోపాలపురం ఎస్సై కర్రి సతీష్ కుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

నల్లజర్లలో..

నల్లజర్ల: ఈ నెల1 నుంచి అమల్లోకి వచ్చిన నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని నల్లజర్ల సీఐ దుర్గాప్రసాద్ విద్యార్థులకు సూచించారు. ఈ చట్టాలపై నల్లజర్ల ఎస్ఆర్‌కే కళాశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భారతీయ శిక్షాస్మృతి(ఐపీసీ) స్థానంలో భారతీయ న్యాయసంహిత, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) స్థానంలో భారతీయ నగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యాల అధినియం చట్టాలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చాయన్నారు.బాధితులు ఇకపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా జరిగిన ఘటనలపై ఫిర్యాదు చేసుకోవచ్చు. జీరో ఎఫ్ఐఆర్ ప్రకారం ఎవరైనా, ఏ పోలీస్ స్టేషన్‌లో అయిన ఫిర్యాదు చేయవచ్చు. ఈ తరహా విషయాలపై అవగాహన చేశారు.